క్లుప్తంగా

పార్టీ శ్రేణులకు వాటర్ బాటిళ్ల అందజేత



పార్టీ కార్యకర్తలకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న భీశెట్టి విలియం ప్రసాద్

డాబాగార్డెన్స్: 38 డిగ్రీల ఉష్ణోగ్రత మండిస్తున్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం.. పార్టీపై మమకారంతో మండుటెండను కూడా లెక్క చేయలేదా నాయకుడు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు తనదైన శైలిలో 42వ వార్డు నాయకుడు భీశెట్టి విలియం ప్రసాద్ మజ్జిగ ప్యాకెట్లు, గ్లూకో వాటర్ బాటిళ్లను అందజేశారు. అంతే కాక 42వ వార్డు నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు భీశెట్టి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



తాము చిత్రించిన బొమ్మలు చూపిస్తున్న విద్యార్థులు

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి సృజనకు అనుగుణంగా బొమ్మలు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు గ్రంథాలయంలో గల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక, సాంఘిక, జనరల్ నాలెడ్జి, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలతో కూడిన పుస్తకాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను అరికట్టి పర్యావరణాన్ని కాపాడదాం



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

మల్కాపురం: ప్లాస్టిక్ వినియోగాన్ని కనీస స్థాయికి తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధికారులు ధ్రువీకరించిన ప్రకారం ఒకసారి వాడి పారివేయాలని సూచించిన ప్లాస్టిక్ వస్తువులను చాలామంది తిరిగి వినియోగిస్తూ తమ ఆరోగ్యాన్ని చేతులారా పాడు చేసుకుంటున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు క్లాత్ సంచులు, పేపర్ బ్యాగ్‌లను వినియోగించాలని సూచించారు. తక్కువ మైక్రాన్ ఉన్న ప్లాస్టిక్ వినియోగం వలన అనర్థాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో చక్కని ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గాజువాక ఆర్టీసీ డిపో వద్ద బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ మాట్లాడుతూ రక్తపోటు నివారణకు నిత్యం వాకింగ్ చేయాలని, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి ధ్యానం వంటివి చేయాలని సూచించారు. ఎంతటి ఒత్తిడి ఉన్న వాటిని తేలిగ్గా తీసుకోవాలన్నారు. మానసికంగా ఒత్తిడి పెంచుకుంటే రక్తపోటుకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు,డిపో కార్మికులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహం.. చంద్రబాబు నైజం

- అమలు కాని హామీలిచ్చి గద్దెనెక్కారు
- ఏడాది అవుతున్నా హామీలు గాలికి
- మహిళలపై దౌర్జన్యాలు పెరుగుతున్నా ఎలాంటి చర్యలు లేవు
- వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్
- పెద్ద ఎత్తున తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



33వ వార్డు నుంచి వార్డు నాయకుడు ముత్తాబత్తుల రమేష్ నేతృత్వంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్న వాసుపల్లి గణేష్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రజలకు నెరవేరని హామీలిచ్చి.. వాటిని గాలికొదిలేయడమే కాక చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో నియోజకవర్గం పలు వార్డుల నుంచి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి వెళ్లారు. నియోజకవర్గం పలు వార్డుల నుంచి ఆయా వార్డుల నాయకులతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తూ జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ఏడాది పాలన వెన్నుపోటు దినాలేనని ఎద్దేవా చేశారు. ఏడాది కూటమి పాలనలో చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ప్రశ్నించలేని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమలు కాని హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. నాడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, 2024 ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకిచ్చిన ఏ హామీ కూడా అమలు చేయకపోగా.. వారి ఆత్మాభిమానంపై దెబ్బ కొడుతున్నారని ధ్వజమెత్తారు. డీబీటీ ద్వారా రెండు లక్షల 65 వేల కోట్ల లబ్ధి ఎటువంటి అవినీతికి తావు లేకుండా పేద ప్రజలకు నేరుగా అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది కాదా.. నేడు కూటమిలో చంద్రబాబు సూపర్‌సిక్స్ అంటూ 12 నెలలు కావచ్చినా ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని దుయ్యబట్టారు. మోదీ పాపులారిటీతోనే చంద్రబాబు గెలిచాడే తప్ప.. బాబుని చూసి ఎవరూ ఓట్లు వేయలేదన్నారు. చంద్రబాబు ఇప్పటి వరకు పోటీ చేసిన ప్రతిసారి ఏదో ఒక పార్టీతో లింక్‌లు పెట్టుకోవడమే తప్ప.. వ్యక్తిగతంగా పోటీ చేయలేని వ్యక్తన్నారు. ఏడాది పాలనలో దళితులు, మహిళలపై దాడులు పెచ్చుమీరాయన్నారు.

29వ వార్డు నుంచి..

జీవీఎంసీ 29వ వార్డు నుంచి ఆ వార్డు నాయకుడు పీతల వాసు నేతృత్వంలో కనకల ఈశ్వర్, బెవర మహేష్, ఆరుగుల రాజ్‌కుమార్, బొండాడ వెంకట్రావు, ఆకుల శ్యామ్‌కుమార్, గుమ్మడి చంద్రమౌళి, పడాల సూర్యకుమార్, కొంద్రు సతీష్, బొడ్డు ధనరాజు, సారిపిల్లి రామనేశ్వర్, కోట ఆనంద్ ప్రసాద్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

41వ వార్డు నుంచి..

41వ వార్డు నుండి ఆ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పిలుపు మేరకు జ్ఞానాపురం నుంచి జిల్లా పరిషత్ జంక్షన్ వరకు తరలి వెళ్లి కలెక్టరేట్ వరకు నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడవడమే కాక మహిళల ఆత్మాభిమానంపై దెబ్బ కొడుతున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు యుద్ధ ప్రాతిపదికన గద్దె దింపాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వేశంగి జీరావు, కుమార్, శ్రీను మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

33వ వార్డు నుంచి..

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపు మేరకు 33వ వార్డు నుంచి ఆ వార్డు నాయకుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు, అభిమానులు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరంతా వార్డు పరిధి నుంచి జిల్లా పరిషత్ జంక్షన్ వరకు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పచ్చిరపల్లి రాము, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు ఆడారి వెంకట మహేష్, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, పార్టీ మహిళా నాయకురాలు సలాది భాను, లక్ష్మీకాంతం, హేమ, కొల్లి సత్యవతి, చంద్రకళ, శిరీష, పార్వతి, రంజిత్, సతీష్, లీల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. 31వ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో వార్డు నుంచి కాండ్రేగుల నాయుడు, రామూ మాస్టార్, గంటా శ్రీను, లండా రమణ, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం..

అల్లిపురం: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు, ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, సీనియర్ నాయకుడు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డు నుంచి..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముందు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించారు. దుర్గాలమ్మ జంక్షన్ నుంచి బౌడారారోడ్డు, వెలంపేట, పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్, గాజులవీధి, రామకృష్ణా జంక్షన్, కల్లుపాకలు మీదగా భారీ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మల్ల బుజ్జి, గంగాధర్, నాగిరెడ్డి, నాయిని శ్రీనివాసరెడ్డి, రవి, పుష్ప, పి.రమణమ్మ, వై.రమణమ్మ, ఎ.రమణమ్మ తదితలులు పాల్గొన్నారు.



34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



కార్యకర్తలతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి



31వ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో తరలిన శ్రేణులు



41వ వార్డు జ్ఞానాపురం నుంచి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ నేతృత్వంలో తరలి వెళ్తున్న పార్టీ కార్యకర్తలు



29వ వార్డు నుంచి పీతల వాసు నేతృత్వంలో తరలిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

సూసైడ్ నోట్ రాసి పరారైన వ్యక్తి

పోలీసులను ఆశ్రయించిన కుటుంబం



అబ్దుల్ రెహమాన్

అల్లిపురం: అప్పులు తీర్చలేక సూసైడ్ నోట్ రాసి వ్యక్తి పరారైన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ అబ్దుల్ రెహమాన్ భార్య, ఇద్దరు పిల్లలతో కలసి ప్రహ్లాద కళ్యాణ మండపం సమీపంలో నివసిస్తున్నాడు. ఇతను ఆప్టికల్ సర్వీసింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇంత వరకు రూ.3 లక్షలు అప్పు చేశాడు. ప్రతి రోజు అప్పులు ఇచ్చిన వారు దుకాణం వద్దకు వచ్చి అప్పు తీర్చమని ఒత్తిడి చేస్తున్నారు. బుధవారం ఉదయం నిద్ర లేచిన రెహమాన్ పెద్ద కుమారుడితో చెప్పి దుకాణానికి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత అని భార్య షేక్ మనీషా ఫోన్ చేసి ఇంటికి రమ్మని చెప్పింది. వస్తానని చెప్పిన వ్యక్తి గంట అయినా రాకపోయేసరికి మరలా ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో దుకాణం వద్దకు వెళ్లే సరికి రెహమాన్ టూవీలర్ దుకాణం వద్దే ఉంది. దుకాణంలో చూడగా సూసైడ్ నోట్ కనిపించింది. అప్పుల వల్ల పిల్లల వద్ద తలెత్తుకుని బతకలేక పోతున్నానని, తాను చనిపోతున్నానని, తన కోసం వెతక వద్దని, పోలీస్ కంప్లెయింట్ ఇస్తే తన శవాన్ని వెతికి ఇస్తారని రాసి ఉంది. దీంతో అతని భార్య మనీషా మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అబ్దుల్ రెహమాన్, సుమారు 42 సంవత్సరాల వయసు కలిగి ఇంటి నుంచి వెళ్లినపుడు నీలం, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ టీ షర్టు, గ్రే కలర్ ట్రాక్ ఫ్యాంటు వేసుకుని ఉన్నట్లు తెలిపారు. ఆ చూకీ తెలిసిన వారు 9440796010, 08912746866 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

యువ దర్శకులు విజయవంతం కావాలి



రత్నం రామ్‌గోపాల్ చిత్రం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: సినిమా రంగంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకుంటున్న యువ దర్శకులు విజయవంతం కావాలని ప్రముఖ సినీ నిర్మాత, నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఫ్యామిలీ ప్యాక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సారథ్యంలో, ఆర్కే మీడియా హౌస్ సహ సమర్పణలో నగరానికి చెందిన యువ దర్శకుడు రత్నం రామ్‌గోపాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రొడక్షన్ నంబర్-3 చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన బుధవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ చిత్రం భారీ విజయం సాధించాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. కళాకారులకు వైజాగ్ పుట్టినిల్లని, ఇక్కడి నుంచే ఎంతో మంది దర్శకులు, సాంకేతిక నిపుణులు, రచయితలు సినిమా రంగంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని తెలిపారు. సినిమా బృందాన్ని వంశీ అభినందించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు రత్నం రామ్‌గోపాల్, ఆర్కే మీడియా హౌస్ అధినేత బి. రవికాంత్, సీనియర్ జర్నలిస్ట్ లఖినేని బాలకృష్ణ, కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్, సహాయ దర్శకుడు నాని, రిషి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో శేష శైలజ

పెందుర్తి: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో) పి.శేష శైలజ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గ ఓటర్ల జాబితాపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటు హక్కు నమోదు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందు పంపిణీ



నులి పురుగుల నివారణ మందు తీసుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్‌లో మెలకువలు నేర్పించారు. పలు ఆటలు ఆడించారు. ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందును ఉచితంగా అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ప్రైవేటులో పుస్తకాల వ్యాపారం

- స్కూళ్లు తెరవక ముందే హడావుడి
- ఒకటో తరగతి పుస్తకాలకు రూ.5 వేల వసూలు
- చోద్యం చూస్తున్న మండల విద్యాశాఖాధికారులు



చంటి పిల్లతోనే క్యూ లైన్‌లో



గోదాం మెట్ల వద్ద కింద కూర్చుని పుస్తకాలు చూసుకుంటున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలంలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు పుస్తకాలతో కూడా వ్యాపారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రైవేటు స్కూళ్లల్లో అడ్మిషన్లకు డిమాండ్ ఉండడంతో ఇదే అదునుగా వ్యాపార విస్తరణకు కొత్తదారులు వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్కూళ్లకు అనుబంధంగా పుస్తకాల విక్రయ దుకాణాలు కూడా తెరుస్తున్నారు. ఎన్ఏడీ సెంటర్‌లోని బుచ్చిరాజుపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అడ్మిషన్లు తీసుకున్న వారందరికీ బుధవారం నుంచి పుస్తకాల విక్రయం మొదలుపెట్టారు. స్కూల్‌కు సమీపంలోని ఓ గోదాములో పుస్తకాలు నిల్వ చేసి, అక్కడికి వచ్చి కొనుగోలు చేయాలని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు గోదాము ముందు క్యూ కట్టారు.

ధరలపై నియంత్రణ ఏదీ?

పుస్తకాల కోసం గాలి, వెలుతురు సరిగా లేని గోదాములో గంటల తరబడి వేచి ఉండలేక కొంతమంది తీవ్ర ఇబ్బందిపడ్డారు. ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల విక్రయాలు చేపట్టరాదని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఉన్నప్పటికీ..సవ్యంగా అమలు కావడం లేదు. ఒకటో తరగతి విద్యార్థికి రూ.5 వేలు పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు. అదే 9వ తరగతి అయితే రూ.15 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు అంటున్నారు. ఈ రీతిన ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి పుస్తకాలు విక్రయించడంతో సామాన్య,మధ్య తరగతి కుటుంబాల వారికి చదువులు భారమవుతున్నాయి.

చోద్యం చూస్తున్న విద్యాశాఖ

మండల విద్యాశాఖాధికారులు ప్రైవేటు స్కూళ్ల విషయంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్‌లో దర్జాగానే పుస్తకాలు విక్రయాలు జరుపుతున్నా విద్యాశాఖాధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

గానగంధర్వుడు బాలు



దొండపర్తిలో బాలసుబ్రహ్మణ్యం జయంతిలో పాల్గొన్న అభిమానులు

మద్రిపాలెం: తెలుగు చిత్రసీమకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేసిన సేవలు చిరస్మరణీయం అని మెలోడి క్రియేటర్స్ సంగీత సేవా సంస్థ, రైల్వే క్వార్టర్స్ కాలనీ కేర్ టీం సభ్యులు అన్నారు. ఈ మేరకు వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో గల వనవిహార్ పార్కులో ఎస్పీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మధురమైన గాత్రంతో సినీ రంగానికి ఎన్నో మధురమైన గీతాలు అందించి అందరి మనసుల్లో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి బాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, ఫణి స్వామి, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలు అభిమానుల ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: కీర్తిశేషులు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి ఆయన అభిమానులు దొండపర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని బీచ్‌రోడ్‌లో ఎస్పీ బాలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బాలు అభిమానులు కోరారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి వాసు, కబడ్డీ శ్రీను, సీబీఐ ఆనంద్, ఇంటీరియర్స్ మధు, బిల్డర్ రవికాంత్, జీవీ రమణ, వెంకీ, సాయి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలి'



దేశపాత్రునిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న పరమేశ్వరి తదితరులు

పరవాడ: మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేశపాత్రునిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పరమేశ్వరి మాట్లాడుతూ మహిళలు ఎంత ఎదిగినా అడుగడుగునా అవమానాలు తప్పట్లేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల వెన్నులో వణుకు పుట్టించేలా నాయకత్వం వహించిన కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమికాసింగ్‌ల కులాలను, మతాలను అడ్డంపెట్టి అధికార పార్టీ బీజేపీ ఎంపీలే అవమానించడం దేశ ద్రోహం కంటే తీవ్రమైన నేరమన్నారు. అవమానించిన వారిపై కేసులు పెట్టి, మహిళల గౌరవాన్ని, దేశ ప్రతిష్టను కాపాడాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, 45 ఏళ్లు నిండిన వారికి ఆర్థిక సాయం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గుడాల లక్ష్మి, నారాయణమ్మ, కింజిరి రమ్య, బి.అరుణ, కె.వర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భగవద్గీత పఠనం

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు పదాలను అక్షర దోషాలు లేకుండా ఉచ్చరించే విధానంపై చిన్నారులు సాధన చేశారు. విద్యార్థులకు చాక్‌లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.